సాక్షి ప్రకాశం

గురువారం । 25 । జనవరి । 2024



చరిత్ర తిరగరాసిన ఘనత జగనన్నదే

వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో ఆసియా ఖండంలోనే అతిపెద్ద సొరంగాలను పూర్తిచేసి సీఎం జగన్ చరిత్ర తిరగరాశారని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. - 10లో..



వెలిగొండపై మాటతప్పని జగనన్న

పశ్చిమ ప్రకాశాన్ని సస్యశ్యామలం చేయాలన్న లక్ష్యంతో సీఎం జగన్ వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేశారని వైపాలెం నియోజకవర్గ సమన్వయకర్త చంద్రశేఖర్ అన్నారు. - 10లో..

గరిష్టం/కనిష్టం
31/22

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఐదుగురు ఎస్సైలకు పదోన్నతి

ఒంగోలు: జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఐదుగురు ఎస్సైలకు పదోన్నతి లభించింది. కొమరోలు ఎస్సై ఎ.సుబ్బరాజు, పుల్లలచెరువు ఎస్సై వై.శ్రీహరి, పామూరు ఎస్సై కె.సురేష్, వీఆర్‌లో ఉన్న డి.ప్రసాద్, ఎస్.సుబ్బారావులు పదోన్నతి పొందారు. వీరు ఉత్తర్వులు అందుకున్న 15 రోజుల్లోగా పదోన్నతి పొందిన స్థానాల్లో చేరాల్సి ఉంటుందన్నారు.

30లోగా డీఈడీ పరీక్ష ఫీజు చెల్లించాలి

ఒంగోలు: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ మూడో సెమిస్టర్ (2022–24 బ్యాచ్) రెగ్యులర్ విద్యార్థులు ఈనెల 30వ తేదీలోగా పరీక్ష ఫీజును తాము అభ్యసిస్తున్న కాలేజీలో ప్రిన్సిపాల్‌కు ఫీజు చెల్లించాలన్నారు. ఈనెల 30వ తేదీలోపు చెల్లిస్తే ఎటువంటి అపరాధ రుసుం ఉండదన్నారు. నాలుగు సబ్జక్టుల వరకు రూ.250 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రూ.50 అపరాధ రుసుంతో ఫిబ్రవరి 2వ తేదీ వరకు గడువు ఉందన్నారు.

గిద్దలూరు తహశీల్దార్‌కు బెస్ట్ ఏఈఆర్‌ఓగా అవార్డు



సీతారామయ్య

ఒంగోలు అర్బన్: ఎన్నికల విధులకు సంబంధించి బెస్ట్ ఏఈఆర్‌ఓగా గిద్దలూరు తహశీల్దార్ సీతారామయ్య గురువారం గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. అదేవిధంగా సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని బీఎల్‌ఓ ఎస్‌కె ఆరిఫ్‌కు బెస్ట్ బీఎల్‌ఓగా అవార్డు ఇవ్వనున్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమంలో అవార్డులు ప్రదానం చేయనున్నారు.

ఆరుతడులకు నీరు విడుదల

- రైతుల కోసం ఏమైనా చేస్తామన్న మంత్రి మేరుగు నాగార్జున



నీరు విడుదల చేస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపాడు: కందుల ఓబుల్ రెడ్డి గుండ్లకమ్మ జలాశయం ఎడమ కాలువ నుంచి బుధవారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయం, విద్య, వైద్యం పైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించారని ఈక్రమంలో రిజర్వాయర్ ఆయకట్టు రైతులు పలువురు తాను నియోజకవర్గ ఇన్‌చార్జిగా పదవి చేపట్టిన రోజున ఆయకట్టుకు నీరందించాలని కోరారన్నారు. పంటలకు ఆరుతడులు ఇవ్వడానికి ఉన్నత స్థాయి అధికారులతో మాట్లాడి నీరు విడుదలకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ప్రాణంగా భావించే రైతులకు ఏ కష్టం రాకుండా చూసుకుంటానని, రైతుల కోసం ఏమైనా చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో కూడా గుండ్లకమ్మ రిజర్వాయర్ నుంచి రైతులకు అందించాల్సిన నీటిని అదనంగా కేటాయించడానికి ఇప్పటి నుంచే కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు ముఖ్యమంత్రి వెంట ఉన్నారని, ఆయనను మరోమారు సీఎంగా చేసుకుంటే ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును ఉన్నత స్థాయికి తీసుకెళ్తారని అన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీపీలు వాకా అరుణ కోటిరెడ్డి, నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, పలువురు వైఎస్‌ఆర్ సీపీ నాయకులు, గుండ్లకమ్మ రిజర్వాయర్ అధికారులు పాల్గొన్నారు.

పార్టీ సానుభూతిపరుని మృతికి సంతాపం: మండలంలోని గార్లపాడు గ్రామంలో మృతిచెందిన పార్టీ సానుభూతిపరుడు వాసేపల్లి సీతారామిరెడ్డి మృతదేహానికి మంత్రి మేరుగు నాగార్జున ఘన నివాళులర్పించారు. పార్టీ ఒక సీనియర్ నాయకుని కోల్పోవడం బాధాకరమని, వారి కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందన్నారు.

లాభాల సాగు

జిల్లాలో ఏడాదికేడాదికి ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఒక వైపు ప్రభుత్వ ప్రోత్సాహం..మరో వైపు తక్కువ ఖర్చుతో దిగుబడులు ఎక్కువగా వస్తుండడంతో రైతులు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. దాదాపు లక్ష ఎకరాల్లో పూలు, పండ్లు, కూరగాయలు పండిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఔషధ, సుగంధ పంటలను సైతం సాగు చేస్తూ ఏటా నాలుగు లక్షల టన్నుల దిగుబడిని సాధిస్తున్నారు. ఉద్యానసాగు రైతును లాభాల బాటను పట్టిస్తున్నాయి.

- ఉద్యాన పంటల సాగుపై రైతుల్లో పెరుగుతున్న ఆసక్తి
- జిల్లాలో రకాల ఉద్యాన తోటలసాగు
- 1.02 లక్షల ఎకరాల్లో పండ్లు, కూరగాయలు, పూలు తదితరాలు
- ఏటా లక్షల టన్నుల ఉద్యాన దిగుబడులు



కొనకనమిట్ల మండలం కొత్తపల్లి గ్రామంలో సాగు చేసిన చామంతి తోట



దర్శి వద్ద వెంకటాలం వద్ద దానిమ్మ తోట

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో ఉద్యానవన పంటల సాగు ఊపందుకుంది. ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు నీటి వనరులు గత నాలుగేళ్ల నుంచి పుష్కలంగా ఉండటంతో జిల్లాలో పండ్ల తోటలు కళకళలాడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ– క్రాప్, ఈ–కేవైసీ అత్యంత పారదర్శకంగా చేపట్టడంతో పంటల వివరాలు పక్కాగా నమోదవుతున్నాయి. జిల్లాలో 1.02 లక్షల ఎకరాల్లో పండ్లు, కూరగాయలు, పూలు తదితర పంటలు సాగులో ఉన్నాయి. అందులో అత్యధికంగా 78 వేల ఎకరాల్లో మిరప, పది వేల ఎకరాల్లో బత్తాయి, నిమ్మ సాగు చేస్తున్నారు. ఏటా 4.18 లక్షల టన్నుల ఉద్యాన దిగుబడులు లభిస్తున్నారు.

ఖరీఫ్ 2023 లో జిల్లా వ్యాప్తంగా ఏకంగా 40 నుంచి 45 రకాల ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. పది నుంచి 12 రకాల పండ్ల తోటలు, 15 రకాల కూరగాయల మొక్కలు, 5 రకాల సుగంధ ద్రవ్యాలు, ఐదు నుంచి ఆరు రకాల పూల తోటలు, 3 రకాల తోట పంటలు, ఐదు రకాల ఆకుకూరలు వెరసి 45 రకాల పంటలు సాగు చేశారు. చీనీ, నిమ్మ, మామిడి, దానిమ్మ, అరటి, బొప్పాయి, జామ, సపోట, డ్రాగన్ ఫ్రూట్, రేగు సాగవుతున్నాయి. పలు కూరగాయలతో పాటు కరివేపాకు, ధనియాలు, ఎండు మిరప, పూల తోటలు, బంతి, మల్లె, గులాబి, లిల్లీ, చామంతి ఉన్నాయి. ఔషధ పంటలు, సుగంధ పంటలు అయిన నన్నారి, పామ్ రోజా, నిమ్మ గడ్డి, వట్టి వేరుల్లో వీర తదితర పంటలు ఉన్నాయి. పలు ఆకు కూరలు ఉన్నాయి.

జిల్లాలో ఉద్యాన పంటల సాగు ఇలా...

పంట	విస్తీర్ణం (ఎకరాల్లో)	దిగుబడి (టన్నుల్లో)
పండ్ల తోటలు	18905	185350
కూరగాయలు	3750	40490
పూలతోటలు	123	300
సుగంధ ద్రవ్యాలు	78,775	1,89,060
ఔషధ, సుగంధ పంటలు	779	2850
తోట పంటలు	110	195
మొత్తం	1,02,442	4,18,245

రాయితీలతో ప్రోత్సాహం..

ప్రభుత్వం ఉద్యాన రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. వివిధ రాయితీలు ఇస్తూ ఆధునిక పద్ధతులతో పంటల సాగును ప్రోత్సహిస్తోంది. ఏటా రూ.10 నుంచి రూ.12 కోట్ల వరకు ఉద్యాన శాఖకు నిధులు కేటాయిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 5 ఎకరాల లోపు ఉంటే 90 శాతం రాయితీ, ఇతరులకు 70 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు అందజేస్తోంది. 90 శాతం మంది రైతులు సూక్ష్మ సేద్యం ద్వారా ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు.

కలెక్షన్ సెంటర్లు (క్లస్టర్ హైరింగ్ కేంద్రాలు), కోల్డ్ రూమ్‌లను రైతు ఉత్పత్తిదారులకు 75 శాతం రాయితీపై ఇస్తున్నారు. ప్రభుత్వం వీటి విస్తరణకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది. ఆధునిక పద్ధతుల్లో షేడ్ నెట్ కింద కూరగాయలు, పూల సాగు, ఉద్యాన పంటల సాగుకు అత్యధికంగా నీటి తడులు ఇవ్వాల్సి వచ్చినప్పుడు అందుకు కావలసిన నీటి కుంటల నిర్మాణంపై 50 శాతం రాయితీ ఇచ్చి ఏర్పాటు చేస్తోంది. తీగ జాతి కూరగాయల సాగుకు కూడా 50 శాతం రాయితీ ఇస్తోంది. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసి వారికి అవగాహన సదస్సులు నిర్వహించి రైతులను ఉద్యానశాఖ ప్రోత్సాహం అందిస్తోంది.

పండ్ల తోటల అభివృద్ధికి ప్రోత్సాహం



అసైన్డ్ భూములు, మెట్ట భూములు కలిగిన రైతులకు పండ్ల తోటలు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం చక్కటి అవకాశాలు కల్పిస్తోంది. మొక్కలు కాపాడుకునేందుకు నీటి సదుపాయం ఉంటే చాలు. ప్రభుత్వం ఉద్యాన వన రైతుల సాగుకు సబ్సిడీ అందిస్తూ ప్రోత్సహిస్తోంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు 5 ఎకరాల లోపు ఉంటే 90 శాతం రాయితీ, ఇతరులకు 70 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు అందజేస్తోంది. దీంతో ఉద్యానవన పంటల సాగు పెరిగింది.

– వై గోపిచంద్, జిల్లా ఉద్యానవనశాఖాధికారి, ఒంగోలు

పేదల పట్టాల కోసం ఎందాకైనా..

- రాజకీయ భవిష్యత్తును ఫణంగా పెట్టి మరీ సాధించా
- 25 వేల మందికి పట్టాలు ఇవ్వగలిగితేనే పోటీ చేయాలని నిర్ణయించుకున్నా
- దీనిని సానుభూతిగా మాట్లాడుతున్నారంటూ ఈనాడులో రాయడం సరికాదు
- సహకరించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు..
- మీడియాతో బాలినేని శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న బాలినేని

ఒంగోలు: ''పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా తెలుగుదేశం పార్టీ న్యాయపరమైన ఇబ్బందులు సృష్టించింది..నగరంలో పేదలకు ఎలాగైనా పట్టాలు ఇచ్చి అద్దె ఇంటి బాధలు తొలగించాలని భావించాను.. ఇళ్ల పట్టాలు ఇవ్వలేని పక్షంలో రాజకీయాల నుంచి వైదొలుగుతానని ముందు నుంచి చెబుతూ వచ్చాను.. నా రాజకీయ భవిష్యత్‌ను ఫణంగా పెట్టి మరి పేదల కల నెరవేర్చేలా అడుగులు వేశాను'' అని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం తనను కలసిన మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. యర్రజర్ల వద్ద 24 వేల మందికి ఒకే చోట ఇళ్ల పట్టాలు ఇవ్వాలని నిర్ణయించామని, ఇదే జరిగితే తమ రాజకీయ భవిష్యత్ ఉండదని భావించిన తెలుగుదేశం నాయకులు కుట్రలు పన్ని కోర్టుల ద్వారా అడ్డుకున్నారని బాలినేని గుర్తు చేశారు. నగరంలో పేదలకు ఎలాగైనా ఇళ్ల పట్టాలు ఇవ్వాలని తాను అప్పుడే నిర్ణయించుకున్నానని స్పష్టం చేశారు. పట్టాలు ఇవ్వలేని పక్షంలో తాను ఒంగోలు నుంచే కాదు, జిల్లాలో ఎక్కడ నుంచీ పోటీ చేయదలుచుకోలేదన్నారు. రాజకీయాల నుంచే తప్పుకోవాలని నిర్ణయం తీసుకున్నానని, తన నిర్ణయం వెనుక వాస్తవాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గమనించారని, వెంటనే రూ.201 కోట్లు విడుదల చేశారన్నారు. సీఎం జగన్‌కు రుణపడి ఉంటానన్నారు. 15 నుంచి 20 రోజుల్లో పేదల ఇళ్ల పట్టాల కోసం సేకరించిన స్థలాల్లో రోడ్లు వేసి, సీఎం జగన్ చేతుల మీదుగా పంపిణీ చేస్తామని ఆయన చెప్పారు. పట్టాలతోపాటు మౌలిక వసతులు కల్పించి ఇళ్లు కూడా కట్టించే బాధ్యత తీసుకుంటానన్నారు. 25 వేల పట్టాలు రెండు ప్రాంతాల్లో ఇస్తున్నామని, భవిష్యత్‌లో ఆ ప్రాంతాలు రెండు పట్టణాలుగా మారిపోతాయని అన్నారు. ఫలితంగా పట్టాదారులకు రూ.5 నుంచి 6 లక్షలు విలువజేసే ఆస్తి చేతికి వస్తుందన్నారు. పేదల ఇళ్ల పట్టాల అంశం కొలిక్కి రావడంతో ఒంగోలుకు వచ్చానని చెప్పారు. నగరానికి వచ్చిన తర్వాత నగరవాసులు, అభిమానులు నిర్వహించిన ర్యాలీలో తాను జరిగిన విషయాలను చెప్పానని, దానిని పచ్చ పత్రిక ఈనాడు వాస్తవాలను వక్రీకరించిందని మండిపడ్డారు. సానుభూతి వచ్చేలా తాను ప్రసంగించానంటూ రాయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను చేసే ప్రతి పని వెనుక ప్రజల సంక్షేమం ఉంటుందన్న విషయాన్ని గమనించాలన్నారు. కనిగిరిలో ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చడంతో నాయకులు రాజీనామాలు చేస్తున్నారని మీడియా అనడంతో రాజీనామాలు చేయడం సరికాదని, సంతనూతలపాడు, కొండపి నియోజకవర్గాల్లో తనకు సంబంధం లేకుండా టికెట్లు ఇచ్చారని, అయినా అక్కడ వారితో తాను రాజీనామాలు చేయించలేదుకదా ? పార్టీ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. వై.పాలెం నియోజకవర్గంలో ఎవరు సహకరించినా, సహకరించకున్నా గెలిపించుకునే బాధ్యత తనదే అన్నారు. మంత్రి కూడా తప్పకుండా సహకరిస్తారని, ఆయన ఎక్కడా సహకరించనని చెప్పలేదు కదా అంటూ మీడియాను ఎదురు ప్రశ్నించారు. ఇక మాగుంట కూడా 30 సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉన్నందువల్ల ఆయనకు కూడా టిక్కెట్ ఇవ్వాలని సీఎంను కోరుతున్నానన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తోందని, సీఎం జగన్ పేదల అభ్యున్నతి పలు సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ఇన్ని మంచి పనులు చేస్తున్న ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తామని బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు.

ఎస్సీ, ఎస్టీ అత్యాచార చట్టంతో సత్వర న్యాయం



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్, పక్కన ఎస్పీ మలికాగర్గ్

- వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఫిర్యాదులు చేస్తే కేసులు నమోదు చేయాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం స్ఫూర్తి దెబ్బతినకుండా బాధితులకు సత్వర న్యాయం జరగాలని అందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పోలీసు, రెవెన్యూ శాఖలు మరింత సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టర్ అధ్యక్షతన జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం బుధవారం ప్రకాశం భవనంలో నిర్వహించారు. ఎస్పీ మలికాగర్గ్‌తో కలిసి చట్టం కింద నమోదైన కేసులు, స్థితిగతులపై సమీక్షించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ సదరు చట్టాన్ని ఎవరైనా వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఆశించి ఫిర్యాదులు చేస్తే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. చట్టం బాధితులకు న్యాయం చేసేలా ఉండాలన్నారు. దర్యాప్తు విషయంలో అవగాహనతో వ్యవహరించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. బాధితులకు ఇచ్చే నష్టపరిహారాన్ని పంపిణీ చేసే సమయంలో వారి పిల్లలకు కూడా లభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. భూ సంబంధిత వివాదాల కారణంగా నమోదయ్యే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు చట్ట ప్రకారం ఆర్థిక ప్రయోజనం దక్కడంతో పాటు భూమి కూడా నిజమైన హక్కుదారులకే చెందేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. దళితుల భూములను అగ్రవర్ణాల వారు కబ్జా చేస్తున్నారని, కురిచేడులో దళితులకు శ్మశాన వాటిక లేక కాలువ కట్టపై పూడ్చిపెడుతున్నట్లు సభ్యులు ప్రస్తావించారు. వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ సమస్యలపై డివిజన్ స్థాయిలో నెలకు ఒకసారి పోలీసులు, రెవెన్యూ అధికారులు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.

ఎస్పీ మలికాగర్గ్ మాట్లాడుతూ 2022, 2023 సంవత్సరాల్లో ఈ చట్టం కింద 265 కేసులు నమోదైనట్లు తెలిపారు. వాటిలో 108 కేసులు పరిష్కరించామన్నారు. మిగిలినవి దర్యాప్తు వేగవంతం చేసినట్లు వివరించారు. కోర్టులో కూడా దోషులకు శిక్ష పడేలా చూడాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్‌ఓ శ్రీలత, మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, కనిగిరి, ఒంగోలు ఆర్‌డీఓలు జాన్ ఇర్విన్, విశ్వేశ్వరరావు, సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, డీఈఓ సుబ్బారావు, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ ఈఐఐ కో ఆర్డినేటర్ జయ, డీఎస్పీలు నారాయణస్వామిరెడ్డి, అశోక్‌వర్ధన్, వీరరాఘవరెడ్డి, శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పీ లక్ష్మయ్య, జయరావు, బీ రమణమ్మ, పీ నాగరాజు, పలువురు తహశీల్దార్లు పాల్గొన్నారు.

జవాబుదారి పాలనకు నిర్వచనం సీఎం జగన్

- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- చెన్నిపాడు పంచాయతీలో రూ.1.20 కోట్లతో నిర్మించిన ఆర్‌బీకే, సీసీ రోడ్లు ప్రారంభం
- బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు



చెన్నిపాడు సభలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

పొన్నలూరు: రాష్ట్ర చరిత్రలోనే అవినీతిలేని జవాబుదారి పాలనకు నిర్వచనం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. మండలంలోని చెన్నిపాడు, ఎదురువారిపాలెం, మంగినంపాడు గ్రామాల్లో బుధవారం పర్యటించి రూ.1.20 కోట్లతో కొత్తగా నిర్మించిన రైతు భరోసా కేంద్ర, సీసీ రోడ్లు, వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. ముందుగా ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, వెన్నపూస శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఓవీ రోడ్డు దగ్గర నుంచి గ్రామంలోకి బైక్‌లతో భారీ ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో మంత్రి సురేష్ బైక్ నడిపి కార్యకర్తలను ఉత్సాహ పరిచారు. అలాగే గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి, సంగమేశ్వరం గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి సురేష్ మాట్లాడుతూ గ్రామాల్లో ఆర్‌బీకేలు నిర్మించడం వలన క్షేత్ర స్థాయిలోనే రైతులకు కావాల్సిన ఎరువులు, మందులు, రాయితీ యంత్రాలు అందుతున్నాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు రైతు రుణమాఫీ చేస్తానని వాగ్దానం చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండా రైతన్నలను నిలువునా మోసం చేశాడన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏడాదికి రూ.13,500 పెట్టుబడి సాయంగా అందిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలతో పాటు గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగు, సాగు నీటికి ఇబ్బందులు లేకుండా వాటర్ ట్యాంక్‌లు, సచివాలయాలు నిర్మాణం, నాడు–నేడు ద్వారా పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాల ఆధునికీకరణ వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు.

సేవకుడిగా కొండపి ప్రజలకు సేవచేస్తా...

కొండపి నియోజకవర్గంలో కొన్నేళ్లుగా పడకేసిన పనులను పూర్తి చేస్తానని, సేవకుడిగా నియోజకవర్గ ప్రజలకు సేవచేస్తానన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి సాధ్యమైనంత త్వరగా కొండపి నియోజకవర్గ ప్రజలకు జీవనాడైన సంగమేశ్వరం ప్రాజెక్టును పూర్తి స్థాయిలో నిర్మించడానికి కృషి చేస్తానన్నారు. అలాగే రామతీర్థం జలాశయం నుంచి ఈ ప్రాంత ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లపోలు బాలకోటిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, మాజీ మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, వైఎస్ ఎంపీపీ అనుమోలు శివయ్య, సర్పంచ్ గుత్తి శారమ్మ, మాజీ సర్పంచ్ వెన్నపూస లక్ష్మి, మాజీ ఎంపీటీసీ వెన్నపూస శ్రీనివాసులురెడ్డి, సంగమేశ్వరం దేవస్థానం చైర్మన్ బూచిరాజు మాల్యాద్రి, వెన్నపూస రమేష్‌రెడ్డి, గుత్తి భాస్కర్, తన్నీరు మాల్యాద్రి, మాజీ సర్పంచ్ ఎస్‌కే మహబూబ్‌ఖాన్, రావిపాటి చినమాలకొండయ్య, ఎదురు బాలాంజనేయరెడ్డి, నాలి వంశీయాదవ్, అరిటివేముల చిన గురవయ్య, కరేటి మాల్యాద్రి, సిరిగిరి గోపాల్‌రెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే రిహార్సల్ పరిశీలన



రిపబ్లిక్‌డే రిహార్సల్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు: 75వ గణతంత్ర దినోత్సవానికి సంబంధించి పోలీసు పరేడ్ గ్రౌండులో నిర్వహించనున్న కార్యక్రమాల్లో భాగంగా సన్నాహక ఏర్పాట్లను ఎస్పీ మలికాగర్గ్ బుధవారం పరిశీలించారు. పోలీసు బలగాలు, హోంగార్డులు, ఎన్‌సీసీ విభాగాల నుంచి 6 ప్లటూన్లు ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయి. వారి నుంచి ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ పతాకం ఎగురవేశారు. పోలీసు బలగాల పరేడ్‌ను కూడా పరిశీలించి కవాతును ఎటువంటి అవాంతరాలు , దోష రహితం లేకుండా నిర్వహించేందుకు కొన్ని సూచనలు చేశారు. అతిథుల గ్యాలరీ, పౌరుల గ్యాలరీ, స్టాల్స్, శకటాల ప్రదర్శన ప్రాంతాలను పరిశీలించారు. రిపబ్లిక్‌డే వేడుకలకు అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. వాహనంలో వెళ్లి పోలీసు బలగాల పరేడ్‌ను కూడా పరిశీలించారు. ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయంగా వ్యవహరిస్తూ ఈనెల 26న జరగనున్న గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్‌బాబు, ఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ దుర్గ ప్రసాద్, ఆర్‌ఐలు శ్రీహరిరెడ్డి, సీతారామరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మరోమారు జగనన్నను సీఎం చేసుకుందాం

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున



మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జునతో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి ఇతర నాయకులు

మద్దిపాడు: మరోమారు జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామని సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. బుధవారం ఆయన రాచవారిపాలెంలో ఏర్పాటు చేసిన పరిచయ కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని దీనికి కారణం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో రకాల పరిశ్రమలు తీసుకువచ్చి విశాఖలో ఐటీ కంపెనీలను పెట్టడానికి అవకాశాలు కల్పించారని అన్నారు. మీకు మేలు జరిగిందని భావిస్తేనే నాకు ఓటు వేయండని అడిగిన ముఖ్యమంత్రిని గతంలో ఎక్కడైనా చూశారా అంటూ ప్రశ్నించారు. ప్రజలకు మేలు చేస్తుందెవరో గమనించాలని ఆయన కోరారు. కార్యక్రమానికి హాజరైన వక్తలు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా జగనన్న వచ్చిన తరువాత గ్రామాల్లో జరిగిన అభివృద్ధి గురించి వివరించారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో మేరుగు నాగార్జునను భారీ మెజారిటీతో గెలిపించుకుని మరోమారు మంత్రిని చేసుకుందామని ప్రజలను కోరారు. అనంతరం మంత్రి సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామ నాయకులతో పరిచయం చేసుకున్నారు. ఈక్రమంలో గ్రామస్తులు గ్రామంలో ఉన్న సమస్యలను వివరించగా ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తానని తెలిపారు. అనంతరం ఆయన ఎస్సీ కాలనీలోకి వెళ్లి స్థానికులతో మాట్లాడారు. పశువులకు నీరు లేదని తెలుపగా సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని బదులిచ్చారు. ముందుగా ఆయన గ్రామంలోని సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, ఓబుల్‌రెడ్డి, సీనియర్ నాయకులు తేళ్ల పుల్లారావు, లింగా రామకృష్ణారెడ్డి, పల్లకి సత్యన్నారాయణరెడ్డి, వల్లం రెడ్డి బాలాంజనేయ రెడ్డి, తిప్పారెడ్డి కోటిరెడ్డి, ప్రసన్నాంజనేయరెడ్డి, గుడ్డపాతల రవి, పల్లపాటి అన్వేష్, దుడ్డు వినోద్, ఎంపీటీసీలు బొమ్మల దేవదాసు, పల్లకి పద్మకుమరి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బెజవాడ రాము, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నారా సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు బొమ్మల రామాంజనేయులు, దేవరపల్లి గంగిరెడ్డి, రాచవారిపాలెం గ్రామ సర్పంచ్ నాగమల్లీశ్వరి, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు పిట్టల ఆంజనేయులు, మాజీ సర్పంచ్‌లు జయమ్మ, సింగయ్య, నాయకులు హరిబాబు, మస్తానమ్మ, పలువురు నాయకులు పార్టీ కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేగ శ్రీ ఆభరణాల ప్రదర్శనకు విశేష స్పందన


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నిర్వాహకులు

ఒంగోలు: హైదరాబాద్ కేంద్రంగా బంగారు, వజ్రాభరణాల షోరూంను దిగ్విజయంగా నిర్వహిస్తున్న వేగ శ్రీ గోల్డ్ అండ్ డైమండ్స్ ఒంగోలులోని హోటల్ సరోవర్‌లో బుధవారం ప్రారంభించిన ఆభరణాల ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. ఈ ప్రదర్శన రెండు రోజులపాటు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. లక్కీడ్రా నిర్వహించి గెలుపొందిన వారికి గోల్డ్ కాయిన్ ఉచితంగా అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ యాజమాన్య ప్రతినిధులు కోరారు. వినియోగదారులు ప్రసిద్ధ ఆభరణాల కోసం దేశంలోని పలు ప్రాంతాలకు తిరిగే శ్రమ లేకుండా ప్రముఖ డిజైనర్స్ రూపొందించిన జ్యువెలరీని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. వేగ శ్రీ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలను తెలుగు రాష్ట్రాలలోని మరికొన్ని నగరాలకు విస్తరించనున్నట్లు చెప్పారు.

వెలిగొండపై మాట తప్పని జగనన్న

- కృష్ణమ్మ పరవళ్లు తొక్కిన తర్వాతే ఓటు అడుగుతామని చెప్పారు
- చంద్రబాబు జమానాలో పశ్చిమ ప్రకాశంపై నిర్లక్ష్యం
- వైఎస్సార్ సీపీ వైపాలెం ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్


మాట్లాడుతున్న తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: పశ్చిమ ప్రకాశాన్ని సస్యశ్యామలం చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెలిగొండ ప్రాజెక్టుకు భారీగా నిధులు కేటాయించి, పనులను పూర్తి చేశారని వైఎస్సార్ సీపీ వైపాలెం ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ పేర్కొన్నారు. పశ్చిమ గడ్డపై కృష్ణమ్మ పరవళ్లు తొక్కిన తర్వాతే ఓటు అడిగేందుకు వస్తామని చెప్పిన వైఎస్ జగన్.. మాట తప్పకుండా వెలిగొండ పనులు పూర్తి చేశారన్నారు. బుధవారం త్రిపురాంతకంలోని ఆర్య వైశ్య సత్రంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. వెలుగొండ రెండు సొరంగాల ద్వారా వచ్చే సీజన్‌లో నీటిని విడుదల చేస్తామని జలవనరుల శాఖ ఇంజినీర్లు చెబుతున్నారని, త్వరలో సీఎం వైఎస్ జగన్ ప్రాజెక్టును ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మహానేత వైఎస్సార్ ప్రారంభించిన ప్రాజెక్టును ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్ పూర్తి చేయడం హర్షణీయమన్నారు.


తాటిపర్తికి స్వాగతం పలుకుతున్న అభిమానులు

పండగల పేర్లు చెప్పి మోసగించిన చంద్రబాబు

టీడీపీ జమానాలో వెలిగొండ ప్రాజెక్ట్‌ను తీవ్ర నిర్లక్ష్యం చేశారని, కాంట్రాక్టర్లకు దోచిపెట్టటానికి ఈ ప్రాజెక్టును వినియోగించుకున్నారని విమర్శించారు. 2014-19 మధ్యలో చంద్రబాబు సీఎం హోదాలో ప్రకాశం జిల్లాలో 16 పర్యాయాలు పర్యటించారని, వచ్చినప్పుడల్లా ఓ పండగ పేరు చెప్పి అప్పటికల్లా వెలుగొండ పూర్తిచేస్తామని ప్రజలను మభ్యపెట్టారని ధ్వజమెత్తారు. అందుకే 2019 ఎన్నికల్లో టీడీపీని వెలుగొండ ప్రాజెక్టులో నిమజ్జనం చేశారని ఎద్దేవా చేశారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తూ పేదల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. 2019 ఎన్నికల్లో వైపాలెం నియోజకవర్గంలో 1,74,928 ఓట్లు పోలయ్యాయని, సంక్షేమ పథకాలు మాత్రం 1.80 లక్షల మందికి అందుతున్నాయని, దీనిని బట్టి అన్ని వర్గాలకు పథకాల లబ్ధి చేకూరుతోందని వివరించారు. టీడీపీ జమానాలో జన్మభూమి కమిటీలదే ఇష్టారాజ్యమని, ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేకపోవడం వల్ల అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలు అనుభవిస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌ను మరోమారు ఆశీర్వదించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. తొలుత బ్రహ్మంగారి గుడి నుంచి భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. మార్గమధ్యంలో వైఎస్సార్ విగ్రహానికి తాటిపర్తి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సింగారెడ్డి నాగమణి, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.పోలిరెడ్డి, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్.పిచ్చయ్య, మండల పరిషత్ వైస్ ఎంపీపీలు ఆళ్ల సుబ్బమ్మ, జి.రిబకమ్మ, సచివాలయాల మండల కన్వీనర్ చల్లా ఎల్లారెడ్డి, సర్పంచ్ పి.వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా సహాయ కార్యదర్శి సరళ, త్రిపురాంతకేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ పద్మజ మల్లికార్జునరావు పాల్గొన్నారు.


ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

వైఎస్సారే మా ప్రాణాలు కాపాడారు!

- బైక్‌ను తప్పించబోయి ప్రమాదానికి గురైన బస్సు
- కేబుల్ వైర్లు బస్సుకు తగిలి ఒరిగిన స్తంభాలు
- బస్సుపై విద్యుత్ తీగలు పడకుండా అడ్డుగా నిలిచిన వైఎస్సార్ విగ్రహం


విద్యుత్ తీగలకు అడ్డుగా నిలిచిన వైఎస్సార్ విగ్రహం

కొండపి(సింగరాయకొండ): ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించే క్రమంలో ఆర్టీసీ బస్సు మార్జిన్‌లోకి దూసుకెళ్లిన సంఘటన బుధవారం కొండపి మండలంలోని పెట్లూరు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. పొదిలి నుంచి కొండపి వస్తున్న ఆర్టీసీ బస్సు పెట్లూరు వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించపోయి రోడ్డు మార్జిన్లోకి వెళ్లింది. ఈ క్రమంలో విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న కేబుల్ వైరు బస్సుకు తగులుకుంది. ఇది గమనించని బస్సు డ్రైవర్ ముందుకు వెళ్లడంతో ఒక స్తంభం విరిగిపడింది. మరో రెండు విద్యుత్ స్తంభాలు కూడా ఒరిగాయి. అయితే విద్యుత్ తీగలు బస్సుపై పడకుండా అక్కడ ఉన్న వైఎస్సార్ విగ్రహం అడ్డుగా నిలిచింది. ఈ ఘటనలో వైఎస్సార్ విగ్రహం ముందుకు ఒరిగింది. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. అదృష్టవశాత్తు బస్సులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. వైఎస్సారే తమను విగ్రహం రూపంలో కాపాడారని పలువురు ప్రయాణికులు చెప్పారు. బస్సు కొండపి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో పెట్లూరులో డ్రైవర్‌ను నిలదీయడంతో వైఎస్సార్ విగ్రహాన్ని పునఃప్రతిష్ట చేయిస్తానని చెప్పడంతో గ్రామస్తులు శాంతించారు. విద్యుత్ స్తంభాలు కూలడం, ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతినడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు విద్యుత్ శాఖ సిబ్బంది తెలిపారు.

మైనారిటీల సంక్షేమానికి కృషి


షాదీఖానా పనులను పరిశీలిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సెంట్రల్: ముస్లిం మైనారిటీ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేసిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఒంగోలులో కొత్త కూరగాయ మార్కెట్ వద్ద నిర్మిస్తున్న షాదీఖానాను బుధవారం పార్టీ నేతలతో కలిసి ఎమ్మెల్యే బాలినేని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షాదీ ఖానా నిర్మాణానికి దివంగత సీఎం వైఎస్సార్ రూ.1.50 కోట్లు మంజూరు చేయడమే కాకుండా స్వయంగా శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా షాదీఖానాకు రూ.4.78 కోట్లు మంజూరు చేయించి పూర్తిస్థాయిలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నానని పేర్కొన్నారు. 2014-19 మధ్య టీడీపీ జమానాలో కేవలం రూ.75 లక్షలు విదిల్చారని, పనులు పూర్తి కాకుండానే ఎన్నికల ముందు హడావుడిగా ప్రారంభించారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన వెంటనే రూ.3.28 కోట్లు కేటాయించి పైఅంతస్తులో కళ్యాణ మండపం ఏర్పాటు చేసి అద్భుతంగా తీర్చిదిద్దామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడా ఇటువంటి షాదీఖానా లేదని చెప్పారు. త్వరలోనే షాదీఖానా ప్రారంభిస్తామని పేర్కొన్నారు. సైట్ లెవెలింగ్‌కు మరో రూ.40 లక్షలు అడిగారని, అవికూడా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

టీడీపీ నేతలుకు చురకలు

షాదీఖానా ఏర్పాటుకు స్థలం కేటాయించడం దగ్గర నుంచి పనులన్నీ తామే చేశామని బాలినేని ఉద్ఘాటించారు. టీడీపీ జమానాలో కేవలం రూ.75 లక్షలు కేటాయించి, గత ఎన్నికల ముందు హడావుడిగా ప్రారంభించారని ఎండగట్టారు. రంగులు మార్చి గొప్పలు చెప్పుకొనే అలవాటు తమకు లేదని టీడీపీ నేతలకు చురకలంటించారు. విషయం తెలుసుకుని మాట్లాడాలని, ప్రజలను మోసం చేయవద్దని హితవు పలికారు. తాము చెప్పిన ప్రకారం పనులు పూర్తి చేశామని, ఈ లెక్కలన్నీ అధికారులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ముస్లింలకు మంచి షాదీఖానా ఉండాలనేది తన అభిమతమన్నారు. తొలి వివాహాన్ని తన ఖర్చులతో చేస్తానని, ముస్లింలంతా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, ఉప మేయర్ వెలనాటి మాధవ, కమిషనర్ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఘనశ్యాం, పార్టీ ముస్లిం విభాగ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ జలీల్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరపతి రావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి కరుణాకర్, గంటా రామానాయుడు, కార్పొరేటర్ శైలజ, అశోక్, శేషగిరి, నత్తల భీమేష్, వెన్నపూస వెంకటరెడ్డి, కాంట్రాక్టర్ కొండయ్య , పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు


మాట్లాడుతున్న దద్దాల నారాయణయాదవ్, వేదికపై జంకె వెంకటరెడ్డి, వైఎం ప్రసాద్‌రెడ్డి

- మంచి జరిగితేనే ఓటేయమని అడిగిన ఏకైక సీఎం వైఎస్ జగన్
- కనిగిరి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి 'దద్దాల' పరిచయ సభలో జంకె వెంకటరెడ్డి
- వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేద్దామని దద్దాల నారాయణయాదవ్ పిలుపు
- కనిగిరిలో భారీ ర్యాలీ.. కదం తొక్కిన పార్టీ శ్రేణులు

కనిగిరి రూరల్: సంక్షేమ పథకాల ద్వారా మీ కుటుంబంలో మంచి జరిగితేనే ఓటు వేయాలని అడిగిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పరిచయ సభ కనిగిరిలోని పవిత్ర కళ్యాణ మండపంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఓమేగా రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్ పరిపాలన సాగిస్తున్నారన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలు త్వరలోనే పశ్చిమ ప్రాంత ప్రజలకు అందనున్నాయన్నారు. పార్టీలో జరుగుతున్న మార్పుల్లో భాగంగా బీసీ, యువకుడైన డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్‌ను సీఎం వైఎస్ జగన్ కనిగిరి ఇన్‌చార్జిగా నియమించారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలంతా ఆశీర్వదించి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

సీఎం జగన్, బాలినేనికి కృతజ్ఞతలు

బీసీ సామాజిక వర్గానికి చెందిన సామాన్య కార్యకర్తనైన తనను కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించి గుర్తింపునిచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, తన నియామకానికి కృషి చేసిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని దద్దాల నారాయణ యాదవ్ పేర్కొన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిని ఇంటింటికీ తిరిగి వివరిస్తానన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులందరితో కలిసి ముందుకెళ్తానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

నారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపిద్దాం

సీఎం జగన్ నియమించిన యువకుడు, విద్యావంతుడు, స్థానికుడైన దద్దాల నారాయణ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దామని పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ జడ్పీటీసీలు, ఎంపీపీలు మడతల కస్తూరి రెడ్డి, గుంటక తిరుపతిరెడ్డి, మేకల శ్రీను, ఓకేరెడ్డి లక్ష్మీ కాంతం, అత్యాల జఘన్య, రామనతిరుపతిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ వైఎం సరితారెడ్డి, గురు ప్రసాద్, నరాల రమణారెడ్డి మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాలకు సీఎం వైఎస్ జగన్ అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. రాబోయే ఎన్నికల్లో దద్దాల నారాయణను 50 వేల మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. వైస్ చైర్మన్లు పులి శాంతి, మాణిక్యరావు, యక్కంటి శ్రీను, రహీం, కటికల వెంకట రత్నం, ప్రతాప్‌రెడ్డి, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, కల్లూరి రామిరెడ్డి, సిద్ధారెడ్డి, శ్రీహరిరెడ్డి, డాక్టర్ రసూల్, జనార్ధన్‌రెడ్డి, సతీష్, గట్లా విజయ భాస్కర్‌రెడ్డి, చిట్టిబాబు, రాజీవ్, మూలే గోపాల్‌రెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. తొలుత పట్టణంలో వేలాది మందితో భారీ స్వాగత ర్యాలీ నిర్వహించారు.


ఘన స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు, అభిమానులు

చరిత్ర తిరగరాసిన ఘనత జగన్‌దే

- ఆసియా ఖండంలో అతి పెద్దవైన వెలిగొండ సొరంగం పనులు పూర్తి
- పశ్చిమ సస్యశ్యామలం.. దర్శి నియోజకవర్గంలో మూడు మండలాలకు తాగునీరు
- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి
- వెలిగొండను చంద్రబాబు ఏటీఎంలా మార్చుకున్నాడని ధ్వజం


మాట్లాడుతున్న వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి

దర్శి: వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా ఆసియా ఖండంలోనే అతి పెద్దవైన సొరంగాల పనులను పూర్తి చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర తిరగరాశారని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక బూచేపల్లి నివాసంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. వెలిగొండ హెడ్ రెగ్యులేటర్ పనులు కూడా ఇప్పటికే పూర్తయ్యాయని, శ్రీశైలానికి వరద నీరు వస్తే వెలిగొండ ప్రాజెక్ట్‌కు తరలించడమే తరువాయి అని అన్నారు. వైఎస్సార్ జీవించి ఉంటే వెలిగొండ ఎప్పుడో పూర్తయ్యేదని చెప్పారు. 1996లో చంద్రబాబు శంకుస్థాపన చేసి వదిలేయగా.. 2004లో అధికారం లోకి వచ్చిన వైఎస్సార్ 18.838 కి.మీ పొడవైన మొదటి సొరంగంలో 11.756 కి.మీ, 18.838 కి.మీ పొడవైన రెండో టన్నెల్‌ను 8.747 కి.మీ పూర్తి చేశారని గుర్తు చేశారు. ఆయన మరణానంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మొదటి సొరంగాన్ని 4.331 కి.మీ, రెండో సొరంగాన్ని 2.335 కి.మీ మాత్రమే తవ్వించారన్నారు. 2019లో అధికారం చేపట్టిన సీఎం వైఎస్ జగన్ మొదటి టన్నెల్‌లో మిగిలిన 2.883 కి.మీను 2021 జనవరి 13వ తేదీకే పూర్తి చేశారన్నారు. రెండో టన్నెల్‌లో మిగిలిన 7.698 కి.మీ ఈనెల 23వ తేదీ నాటికి పూర్తి చేశారని చెప్పారు. చంద్రబాబు హయాంలో రెండు సొరంగాలు కలిపి 6.686 కి.మీ తవ్వితే.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం 10.581 కి.మీ తవ్వించి పశ్చిమ ప్రకాశం ప్రజల ఆకాంక్షను నెరవేర్చారన్నారు. దర్శి, కురిచేడు, దొనకొండ మండలాలకు తాగునీటితోపాటు కురిచేడు మండలంలో 6 వేల ఎకరాలు, దొనకొండ మండలంలో 17 వేల ఎకరాలకు సాగునీరు అందనున్నాయని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌కు రైతులు, ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబు ఏటీఎంలా వెలిగొండ

చంద్రబాబు దోచుకోవడమే లక్ష్యంగా వెలిగొండ ప్రాజెక్టును ఏటీఎంలా వాడుకుని కాంట్రాక్టర్లకు రూ.650 కోట్లకు పైగా దోచి పెట్టారని బూచేపల్లి విమర్శించారు. 2014 నుంచి 2019 వరకు రూ.1414.51 కోట్లు ఖర్చు చేసినా పనుల్లో ఏమాత్రం ప్రగతి కనిపించకపోవడం బాబు దోపిడీని స్పష్టం చేస్తోందన్నారు. రెండో సొరంగం పనులు చేస్తున్న కాంట్రాక్టర్లను తొలగించి అంచనా వ్యయం పెంచి వాటిని అధిక ధరలకు సీఎం రమేష్‌కు కట్టబెటి కమీషన్లు దండుకున్నారని దుయ్యబట్టారు. సీఎం రమేష్‌కు కట్టబెట్టిన రెండో సొరంగంలో మిగిలిన పనులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రద్దు చేసి రివర్స్ టెండరింగ్ ద్వారా చంద్రబాబు అప్పగించిన ధరల కంటే రూ.61.76 కోట్లు తక్కువకు పూర్తి చేశారన్నారు.

'పశ్చిమ'.. మరో కోనసీమ

- వెలిగొండ పనులు పూర్తి చేసిన సీఎం జగన్‌కు పాదాభివందనం
- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో 15 లక్షల మంది ప్రజలకు తాగునీరు, 4.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసిన అపర భగీరథుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు, రైతుల తరఫున పాదాభివందనం చేస్తున్నామని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ జలయజ్ఞంలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించి చాలా వరకూ పూర్తిచేయగా.. 2014 నుంచి 2019 వరకూ అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ఏటీఎంలా వాడుకుందన్నారు. కరోనా సమయం మినహాయిస్తే మిగిలిన రెండున్నరేళ్లలో సీఎం వైఎస్ జగన్ వెలిగొండ పనులను పరుగులెత్తించారని చెప్పారు. ఫిబ్రవరి మొదటివారంలో వెలుగొండ ప్రాజెక్టును సీఎం వైఎస్ జగన్ జాతికి అంకితం చేయనున్నారని ఎమ్మెల్యే వెల్లడించారు. వెలిగొండ ప్రాజెక్టుతో పశ్చిమ ప్రకాశం మరో కోనసీమగా మారుతుందని అభివర్ణించారు.

ఐదు దశాబ్దాల కలను నెరవేర్చిన సీఎం జగన్ ప్రజల మనసులో చిరస్థాయిగా నిలుస్తారన్నారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్ 2 అంజమ్మ శ్రీనివాసులు, ఎంపీపీ అరుణా చెంచిరెడ్డి, జడ్పిటిసి బాపన్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, చెన్నకేశవస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ పెనుగొండ కేశవరావు, ప్రచార కార్యదర్శి మయూరి ఖాశీం, పొదిలి ఏఎంసీ మాజీ చైర్మన్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.